# కేసీఆర్‌తో కామారెడ్డి మరింత అభివృద్ధి

- భారీ మెజారిటీతో గెలిపిద్దాం
- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్
- అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని హామీ


జంగంపల్లి లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


బీబీపేట్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు సోదరుడు మహేశ్‌రావు

భిక్కనూరు, నవంబర్ 21: కేసీఆర్‌తో కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. మండలంలోని జంగంపల్లి , లక్ష్మీదేవుని పల్లి గ్రామాల్లో సీంఎ కేసీఆర్ తరపున మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి రైతులకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జంగంపల్లి గ్రామంలో భూములు లాక్కుంటారనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. వడగడ్ల వానకు పంటనష్ట పోయిన రైతులుకు కేసీఆర్ మాటిచ్చారని, తప్పకుండా పరిహారం చెల్లిస్తారని తెలిపారు. త్వరలో రైతులందరికీ రుణమాఫీ వస్తుందన్నారు. ఆసరా పింఛన్లను రూ. 5వేలు, రైతుబంధు రూ.16వేలకు పెంచుతామని తెలిపారు. పేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం, ప్రతి కుటుంబానికీ రూ. 5లక్షల కేసీఆర్ బీమా కల్పించనున్నట్లు వివరించారు. కటాఫ్ తేదీ లేకుండా కొత్తవారికి కూడా బీడీ పింఛన్లు ఇస్తామన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని తెలిపారు. 3 గంటల కరెంటు కావాలో? మూడు పంటలు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.

**బీజేపీ నాయకుడి చేరిక..**

జంగంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్, రామాయంపేట తిరుపతి గౌడ్, నవాజ్ బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ప్రభుత్వ విప్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచులు ఫోరం జిల్లా కన్వీనర్ నర్సింహులు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ సిద్దరాములు, ఎంపీటీసీ యశోద, విండోవైస్ చైర్మన్ వాసూయాదవ్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్‌చంద్రం, వీడీసీ అధ్యక్షుడు శివలింగం, నాయకులు రామస్వామి, సంతోష్, నవీన్, యుత్ విభాగం అధ్యక్షుడు దార శేఖర్, బన్నీ, అరుణ్, తదిరులు పాల్గొన్నారు.

**3 గంటలా? మూడు పంటలా..**

రాజంపేట్, నవంబర్ 21: మండలంలోని పొందుర్తి, శివాయిపల్లి, తలమడ్ల, ఆరెపల్లి గ్రామాల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు బోనాలు, మంగళహారతులు, డప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు మూడు గంటలే కరెంటు ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఉచితంగా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. దీంతో అన్నదాతలు ఎలాంటి రంది లేకుండా పంటలు సాగు చేసుకుంటున్నారని వివరించారు. రేవంత్‌రెడ్డి ఇచ్చే మూడు గంటల కరెంటు కావాలా? సీఎం కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంటుతో మూడు పంటలు కావాలా అని ప్రజలను అడిగారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను నమ్మి మోసపోవొద్దని సూచించారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయడం మన అదృష్టమని, మన నియోజకవర్గం రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా మారుతుందన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పొందుర్తి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్లయ్య తిరిగి విప్ సమక్షంలో సొంత గూటికి వచ్చారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిక్కాజి బల్వంత్‌రావు, ఎన్నికల సమన్వయ సమితి సభ్యులు నల్లవెల్లి అశోక్, నాయకులు జూకంటి మోహన్ రెడ్డి, మాలీస్ కమలాకర్‌రావు, సర్పంచులు గంగాకిషన్, విఠల్‌రెడ్డి, కొమ్ము యాదయ్య, ఎంపీటీసీలు బాలరాజ్‌గౌడ్, నర్మల రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జోరుగా కొనసాగుతున్న ప్రచారం**

దోమకొండ/బీబీపేట్/మాచారెడ్డి/భిక్కనూరు/కామారెడ్డి రూరల్/కామారెడ్డి, నవంబర్ 21: దోమకొండ, బీబీపేట్ మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గంలో పోటీచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజర్టీతో గెలిపించాలన్నారు. మాచారెడ్డి మండలం గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో సర్పంచ్ హంజీనాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు భారీగా ర్యాలీ తీశారు. కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామంలో కేసీఆర్ గెలుపుకోసం మాజీ సర్పంచ్ మల్కరాజు బజ్జీలు అమ్ముతూ ప్రచారం నిర్వహించారు. కామారెడ్డిలో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. 47వ వార్డులో కొబ్బరి బోండం కొట్టి ప్రచారం చేశారు. రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, గరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్‌కు పట్టణ స్వర్ణకారుల మద్దతు**

కామారెడ్డి, నవంబర్ 21: కామారెడ్డి పట్టణ స్వర్ణకార సంఘ ప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావుకు తీర్మాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ముప్పారపు ఆనంద్, ప్రసాద్, పట్టణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి హరీశ్‌రావు సోదరుడి రోడ్‌షో..**

బీబీపేట్, నవబంర్ 21: కేసీఆర్‌కు మద్దతుగా మంత్రి హరీశ్‌రావు సోదరుడు మహేశ్‌రావు బీబీపేట్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. కేసీఆర్ భారీ మెజారిటీతో గెలిస్తే కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో డాక్టర్ శ్రీనివాస్‌రావు ఎన్ఆర్ఐ బృందం సభ్యులు, స్థానిక నాయకులుపాల్గొన్నారు.


నిట్టు వేణుగోపాల్ రావుకు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న పట్టణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు




కామారెడ్డి, దోమకొండ, గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, నవంబర్ 21 : ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. రాష్ట్ర శాసనసభ 2023 ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం కలెక్టర్లు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను అందించడంలో ఆలస్యం చేయకుండా సకాలంలో పంపించాలని అన్నారు. 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇండ్లవద్ద నుంచే ఓటు హక్కు వినియోగించేందుకు వీలుగా చేపట్టిన హోమ్ ఓటింగ్ ఏర్పాట్లపై ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో ఆరా తీశారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన కసరత్తులు గురించి ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలలో 60 శాతం వెబ్ క్యాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. 82,281 ఓటరు ఎపిక్ కార్డుల ముద్రణకు ఏజన్సీకి ఇవ్వగా జిల్లాకు అందిన 75,398 కార్డులను పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇంటింటికీ ఓటరు స్లిప్పులతోపాటు ఓటు గైడ్ సీ విజిల్ కరపత్రం బీఎల్‌వోల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. 12 బృందాల ద్వారా మూడు నియోజకవర్గాల్లో వృద్ధులు, దివ్యాంగుల నుంచి హోం ఓటింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# సిలిండర్ పేలి ఐదు గుడిసెలు దగ్ధం

బీబీపేట్, నవంబర్ 21 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఐదు గుడిసెలు దగ్ధమైన సంఘటన బీబీపేట్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది కలిసి మంటలను ఆర్పివేశారు. ఆర్ఐ అజయ్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాపూర్ గ్రామంలో సడుగు గంగారాం, సడుగు పర్షరాములు, సడుగు లక్ష్మి, సడుగు రాజయ్య, సడుగు చిన్న శంకరయ్య గుడిసెలు సిలిండర్లు పేలడంతో దగ్ధమయ్యాయి. వారందరూ వ్యవసాయ పనుల నిమిత్తం పంటపొలాలకు వెళ్లడంతో ప్రాణనష్టం జరుగాలేదని ఆర్ఐ తెలిపారు. ఐదు గుడిసెల్లో ఉన్న వంటసామగ్రి, చదువుకున్న సర్టిఫికెట్స్, పట్టా పాస్ బుక్స్, బ్యాంక్ పాస్ బుక్‌లు, రేషన్ కార్డులు, డబ్బులు, బంగారం, వెండి తదితర వస్తువులు మంటల్లో కాలిపోవడంతో బాధితులు బోరున విలపించారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మాందాపూర్ గ్రామానికి చెందిన జై భవాని యూత్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, బియ్యం, గ్యాస్ పొయ్యి ఇతర సామగ్రిని అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు